సాక్షి విజయనగరం

ఆదివారం । 23 । ఏప్రిల్ । 2023



రండి.. ఈదేద్దాం...

ఈత (స్విమ్మింగ్) సాధకులకు శుభవార్త. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో కంటోన్మెంట్ ప్రాంతంలో నిర్వహిస్తున్న ఆక్వా స్విమ్మింగ్ పూల్ స్వాగతం పలుకుతోంది.

- IIలో



చందనసేవకు వేళాయె

విశాఖపట్నం జిల్లా సింహాచలంలో వెలసిన సింహాద్రి అప్పన్న చందనోత్సవానికి వేళయింది.

- IIలో



30న ఏపీజీఈఏ రాష్ట్ర సదస్సు

రాజమండ్రిలో ఈ నెల 30వ తేదీన నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని జిల్లా కమిటీ పిలుపునిచ్చింది.

- IIలో

న్యూస్‌రీల్

నేడు మంత్రి బొత్స రాక

విజయనగరం అర్బన్: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఈ నెల 23న రాత్రి విశాఖనుంచి నగరంలోని తన నివాసానికి చేరుకుంటారు. 24న ఉదయం 10 గంటలకు కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అధికారులతో సమావేశమవుతారు. వచ్చేనెల 3న జరగనున్న భోగాపురం అంతార్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు శంకుస్థాపన ఏర్పాట్లపై సమీక్షిస్తారు. 11 గంటలకు సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం పనులపై అధికారులతో చర్చిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు శ్రీకాకుళం జిల్లా రాపాక చేరుకొని మడ్డువలస ప్రాజెక్టు రెండోదశ పనులకు శంకుస్థాపన చేస్తారు. 25న ఉదయం 10 గంటలకు చీపురుపల్లి మండలం కర్లాం చేరుకొని గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, పీఏసీఎస్, పీహెచ్‌సీ అదనపు భవనాలను ప్రారంభిస్తారు. అనంతరం అక్కడ బహిరంగ సభలో పాల్గొంటారు. మధ్యాహ్నం 4 గంటలకు గుర్ల మండలం జమ్ములో గ్రామ సచివాలయం, వెల్‌నెస్ సెంటర్ భవనాలను ప్రారంభించి అనంతరం బహిరంగ సభలో పాల్గొంటారు.

రైతుల ఆర్థికాభివృద్ధికి డీసీఎమ్ఎస్ కృషి

- డీసీఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన



సమావేశంలో మాట్లాడుతున్న డీసీఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన

విజయనగరం: విశ్వవ్యాప్తంగా ఎన్నో సామాజిక సేవలు అందిస్తున్న రోటరీ క్లబ్... భవిష్యత్‌లో వ్యవసాయరంగానికి సహకారం అందించాలని విజయనగరం ఉమ్మడి జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన కోరారు. విజయనగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో శనివారం రోటరీ క్లబ్ నిర్వహించిన 'నేటి జీవనశైలికి రైతుల జీవితాలు- వారి అభ్యున్నతిలో జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ సహకారం, నేటి జీవనశైలి కోసం దంతవైద్యం' అనే అంశంపై ఆమె మాట్లాడారు. రైతులకు డీసీఎమ్ఎస్ తరఫున విస్తృత సేవలు అందిస్తున్నామన్నారు. ఈ ఏడాది రూ.21 కోట్ల టర్నోవర్ సాధించినట్టు తెలిపారు. మహిళలకు టెక్స్‌టైల్ రంగంలో శిక్షణ ఇస్తున్నామన్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు విత్తనాలు, ఎరువులు అందించడం, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం వంటి ఎన్నో వినూత్నమైన కార్యక్రమాలకు డీసీఎమ్ఎస్ శ్రీకారం చుట్టిందన్నారు. వ్యవసాయ ఉత్పత్తులను నేరుగా ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, పైడితల్లి, పోలమాంబ అమ్మవార్ల దేవస్థానం అన్నదానసత్రాలకు, అంగన్‌వాడీలకు పంపిణీ చేస్తున్నామన్నారు. రైతులకు సేవలందించేందుకు రోటరీక్లబ్ ముందుకు రావాలని కోరారు. దంత ఆరోగ్యంపై ప్రతీ ఒక్కరూ శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ విజయనగరం ప్రెసిడెంట్ కృష్ణ గోపాల్‌అగర్వాల్, సెక్రటరీ సాయిమనోజ్, క్లబ్ సర్వీసెస్ డైరెక్టర్ శంకర్‌రెడ్డి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

25న సర్టిఫికెట్ల పరిశీలన

విజయనగరం టౌన్: ఏపీఎస్ ఆర్టీసీలో కారుణ్యనియామకాలు చేపట్టారు. 2016 జనవరి ఒకటో తేదీ నుంచి 2019 డిసెంబర్ 31 మధ్యలో విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలో ఉద్యోగం చేస్తూ మృతి చెందిన వారి కుటుంబ సభ్యుల్లో ఒకరికి అర్హతను బట్టి ఉద్యోగాలు కల్పిస్తున్నారు. వారి విద్యార్హత సర్టిఫికెట్ల పరిశీలన ఈ నెల 25న ఉదయం 10 గంటలకు విజయనగరం డీపీటీఓ కార్యాలయంలో నిర్వహిస్తామని నెక్ రీజియన్ రీజినల్ మేనేజర్ ఆకాశపు విజయకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు గమనించాలన్నారు.

ఈద్‌ముబారక్



విజయనగరం హుస్సేనిమసీదులో ప్రార్థన చేస్తున్న చిన్నారి, పెద్దలు

పవిత్రమైన రమజాన్ పర్వదినాన జిల్లాలోని ముస్లిం సోదరులందరూ శనివారం ఆధ్యాత్మిక చింతనతో గడిపారు. కొత్త దుస్తులు ధరించి.. అత్తరులు జల్లుకుని ఉదయం 8 గంటలకు ఈద్‌గాలకు చేరుకుని సామూహికంగా నమాజ్ చేశారు. మతపెద్దలు వినిపించిన పవిత్ర ఖురాన్‌లోని దివ్య సందేశాన్ని శ్రద్ధగా విన్నారు. నెలరోజుల పాటు చేసిన కఠిన ఉపవాస దీక్ష విశేషాన్ని తెలుసుకున్నారు. సమస్త మానవాళికి సుఖసంతోషాలు కలగాలని, సమస్యలు తొలగిపోవాలని, కుటుంబ జీవనం సాఫీగా సాగిపోవాలని, ప్రపంచ శాంతి కలగాలని అల్లాను ప్రార్థించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ రమజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. చిన్నారులు సందడిగా గడిపారు. రమజాన్ పర్వదినాన విజయనగరం పట్టణంలోని జామియా, చోటీ, కంటోన్మెంట్, ఆబాద్ మసీదులు, ఎస్.కోట, బొబ్బిలి, కొత్తవలస, రాజాం తదితర ప్రాంతాల్లోని మసీదులు ముస్లింల ప్రార్థనలతో సందడిగా కనిపించాయి.

– విజయనగరం టౌన్





నమాజ్ చేస్తున్న ముస్లింలు, ఒకరికొకరు రమజాన్ శుభాకాంక్షలు చెప్పుకుంటున్న ముస్లింలు



చిన్నారుల ఈద్ ముబారక్

అన్నింటా ప్రగతి పథం



బొద్దాంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, పాల్గొన్న జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే కంబాల జోగులు తదితరులు

- అందరి సహకారంతో అవినీతిలేని అభివృద్ధి
- బొద్దాంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహణ
- పాల్గొన్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

రాజాం: వలంటీర్లు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అధికారులు, అన్నివర్గాల ప్రజల సహకారంతో రాష్ట్రం ప్రగతి పథంలో పయనిస్తోందని టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని బొద్దాం గ్రామంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. తొలుత గ్రామంలోని పలువురు ఇళ్లకు వెళ్లి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పాలనపై అభిప్రాయాలు సేకరించారు. ఇంటింటికీ 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లను అతికించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో టీటీడీ చైర్మన్ ప్రజలనుద్దేశించి మాట్లాడారు. రాష్ట్రంలో అవినీతిలేని అభివృద్ధి జరుగుతోందని వెల్లడించారు. గత నాలుగేళ్లలో అన్ని వర్గాల ప్రజల కోసం సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలను ఇంటింటికీ వివరించేందుకు జగనన్నే మా భవిష్యత్, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. నాడు-నేడు పనులతో ప్రభుత్వ విద్యాలయాలు, ఆస్పత్రులు అందంగా ముస్తాబయ్యాయన్నారు. పేద విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన, జగనన్న విద్యాకానుకలు, అమ్మఒడి వంటి పథకాలతో పాటు విదేశీ విద్యను కూడా చేరువ చేశారన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని వెల్లడించారు. రాష్ట్రంలో నాలుగు లక్షల ఉద్యోగాలు భర్తీచేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గత టీడీపీ ప్రభుత్వం రైతులను పట్టించుకోలేదని, ఒక్క ఉద్యోగం తీయకపోగా, నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. టీడీపీ నేతలు గ్రామాల్లోకి వచ్చి తప్పుడు ప్రచారాలు చేస్తే నిలదీయాలని పిలుపునిచ్చారు. ప్రతిపక్ష నాయకులు తమ అనుకూల మీడియాను అడ్డుపెట్టుకుని విషం చిమ్ముతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. ఒకరు పాదయాత్ర పేరుతో మరొకరు రథయాత్ర పేరుతో అధికారం దక్కించుకునేందుకు అడ్డదారులు తొక్కుతున్నారన్నారు. చంద్రబాబు పెద్ద మోసగాడని విమర్శించారు. కోట్లాది మందికి చేరువైన సంక్షేమ పాలన సజావుగా సాగేందుకు వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు.

సెల్ఫీ నేత... నీ అభివృద్ధి ఏది..

జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇటీవల టీడీపీ నేతలు సెల్ఫీచాలెంజ్ పేరుతో పిచ్చిచేష్టలకు దిగుతున్నారన్నారు. విజయనగరంకు చెందిన కేంద్ర పౌరవిమాన శాఖ మాజీ మంత్రి అశోక గజపతిరాజు తన హయాంలో ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా జిల్లాలో చేయలేదని విమర్శించారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో చేసిన అభివృద్ధిని బహిరంగంగా వివరించగల సత్తా ఉందా అని సవాల్ విసిరారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు అన్ని అనుమతులు తెచ్చినది, తోటపల్లి ప్రాజెక్టు కాలువ పనులు పూర్తిచేసి వేలాది ఎకరాలకు సాగునీరు అందించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. సంక్షేమ, అభివృద్ధి పాలన సాగించడంతో ప్రతీ ఒక్కరూ జగనన్నే మా భవిష్యత్ అంటున్నారని, ఆయననే మళ్లీ సీఎం చేస్తామని గట్టిగా చెబుతున్నారన్నారు.

- విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ నాలుగేళ్లలో రాష్ట్రంలో అభివృద్ధి పనులు పెద్ద ఎత్తున సాగాయన్నారు. ఒక్క బొద్దాం పంచాయతీలో అభివృద్ధిపనులు, సంక్షేమ పథకాల రూపంలో ప్రజలకు రూ.16కోట్ల మేర లబ్ధిచేకూరిందన్నారు.
- రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు మాట్లాడుతూ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల అభివృద్ధికి కృషిచేస్తున్నారని తెలిపారు. తన రాజకీయ చరిత్రలో ఇటువంటి సీఎంను చూడలేదన్నారు. అన్ని వర్గాల ప్రజలకు నేరుగా సంక్షేమం అందించడంతో దేశంలోనే రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని వివరించారు.
- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ ఈ ప్రాంతం ఎల్లప్పుడూ వైఎస్సార్ కుటుంబానికి అండగా ఉంటుందన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కూడా స్థానిక శాసనసభ్యులను అత్యధిక మెజార్టీతో గెలిపించి సీఎంకు కానుకగా ఇస్తామని పేర్కొన్నారు. ప్రజలు మాత్రం టీడీపీ నేతల వ్యవహారంపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. కార్యక్రమంలో రాజాం నియోజకవర్గ పరిశీలకుడు పేడాడ తిలక్, జెడ్పీ వైస్ చైర్మన్‌లు సిరిపురపు జగన్మోహనరావు, కె.వి.సూర్యనారాయణరాజు, ఎంపీపీ లావేటి సులోచన, వైస్ ఎంపీపీ నక్క వర్షిణి, యాలాల సునీత, జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు, సర్పంచ్ నక్క తవిటమ్మ, వంగర ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, వైఎస్ఆర్‌సీపీ నాయకులు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, పొట్నూరు లక్ష్మణరావు, కరణం సుదర్శనరావు, వావిలపల్లి జగన్మోహనరావులు, వాకముల్ల చిన్నంనాయుడు, కె.శ్రీరంగంనాయుడు, ఆర్.రమేష్‌నాయుడు, ఎమ్.విజయలక్ష్మి, నక్క శ్రీను, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



మా నమ్మకం నువ్వే జగన్ అంటూ స్టిక్కర్లను చూపుతున్న బొద్దాం వాసులు

జాతరకు వేళాయె..

- 16 ఏళ్ల తర్వాత తాడమ్మ, బంగారమ్మ తల్లుల జాతర
- నేటి నుంచి మూడు రోజుల పాటు నిర్వహణ
- ఆరు గ్రామాల్లో పండగ సందడి



పెదమంత్రిపేటలో వెలసిన తాడమ్మతల్లి, బంగారమ్మ విగ్రహాలు

మెరకముడిదాం: మండలంలోని పెదమంత్రిపేట, గర్భాం, చినమంత్రిపేట, నరసయ్యపేట, బోడం దొరవలస, లెంకపేట గ్రామాల ప్రజల ఆరాధ్య దేవతలు తాడమ్మ, బంగారమ్మ తల్లి జాతరకు వేళయింది. ఆది, సోమ, మంగళవారాల్లో నిర్వహించనున్న జాతరకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తిచేశారు. సిరిమానోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. 16 ఏళ్ల తర్వాత జరిగే జాతరతో ఆరు గ్రామాల్లో పండగ సందడి నెలకుంది. దూర ప్రాంతాల్లో నివసించేవారంతా స్వగ్రామాలకు చేరుకున్నారు.



సిరిమానోత్సవానికి సిద్ధమైన రథం

గర్భాంలో సిరిమానోత్సవం

అమ్మవార్ల విగ్రహాలు పెదమంత్రిపేటలో ఉండగా, సిరిమానోత్సవం గర్భాంలో నిర్వహించడం ఇక్కడి ప్రత్యేకత. ఆదివారం తొలేళ్ల ఉత్సవం నిర్వహిస్తారు. సోమవారం నిర్వహించే సిరిమానోత్సవంలో పూజారి పల్లేడ అప్పలనాయుడు సిరిమానును అధిరోహించనున్నారు. గర్భాం ప్రధానవీధి గుండా చిరతగట్టు (గర్భాం, గరివిడి ప్రధాన కూడలి) వరకూ సిరిమాను తిరగనుంది. సిరిమానోత్సవంలో లక్షలాది మంది భక్తులు పాల్గొంటారని అంచనా. అమ్మవార్లను రాష్ట్ర విద్యాశాఖమంత్రి బొత్స సత్యనారాయణ, మాజీ ఎంపీ బొత్సఝాన్సీలక్ష్మి, జెడ్పీచైర్మన్ మజ్జిశ్రీనివాసరావు, విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎంపీపీ తాడ్డి కృష్ణవేణి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు తదితరులు అమ్మవార్లను దర్శించుకోనున్నారు.

భారీబందోబస్తు..

జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చీపురుపల్లి డీఎస్పీ బి.మోహన్‌రావు, సీఐ జి.సంజీవరావు, బుధరాయవలస ఎస్ఐ సీహెచ్.నవీన్‌పడాల్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు విధులు నిర్వహించనున్నారు.

మత్స్యకారులకు ఆర్థిక అండ



వేట నిషేధం కావడంతో చింతపల్లి తీరంలో నిలిచిన బోట్లు

- మత్స్యకారులకు వేటనిషేధ భృతి చెల్లింపునకు ఏర్పాట్లు
- జిల్లాలో 3,908 మంది అర్హులుగా గుర్తింపు
- మే రెండో వారంలో మత్స్యకారుల ఖాతాలకు రూ.10వేల చొప్పున జమ

సంవత్సరం	బోట్లు సంఖ్య	లబ్ధిదారులు	భృతి (రూ.కోట్లలో)
2019-20	582	2,645	2.645
2020-21	569	2,772	2.772
2021-22	809	2,335	2.335

పూసపాటిరేగ: సముద్రమే సర్వస్వంగా జీవిస్తున్న మత్స్యకారులకు ప్రభుత్వం ఆర్థిక చేయూతనందిస్తోంది. వేట నిషేధ సమయంలో బతుకుదెరువుకు ఆర్థిక సాయం చేస్తోంది. లబ్ధిదారుడి ఖాతాకు నేరుగా రూ.10 వేలు జమచేసేందుకు జిల్లా మత్స్యశాఖ అధికారులు అర్హుల జాబితాను సిద్ధం చేశారు. వీరి ఖాతాలకు మే రెండో వారంలో నిధులు జమకానున్నాయి.

ఇదీ పరిస్థితి..

పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లోని తీర గ్రామాల్లో సుమారు 6 వేల మంది మత్స్యకారులు ఉన్నారు. వీరిలో 858 ఇంజిన్‌బోట్లతో వేటసాగించేవారు 3,908 మంది మత్స్యకారులు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. వీరందరికీ వేట నిషేధ కాలాని (ఏప్రిల్ 15- జూన్ 14)కి ఆర్థిక సాయం అందనుందని మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ నిర్మలాకుమారి, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి చాందిని తెలిపారు. గతంలో సమయానికి భృతిమంజూరయ్యేది కాదని, జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తంచన్‌గా మత్స్యకారులకు వేటనిషేధ భృతి అందిస్తోందన్నారు.



పులిదాడిలో మృతి చెందిన ఆవు

ఆవులమందపై పులి దాడి

- భయంతో పరుగుతీసిన కాపరులు
- చెల్లాచెదురైన ఆవులు
- ఒక ఆవును హతమార్చిన పులి

బొండపల్లి: మండంలంలోని కొత్తపాలెం పంచాయతీ పరిధి శివుడుపాలెం గిరిజన గ్రామ సమీపంలోని కొండ ప్రాంతం వైపు ఈతకట్టు గున్నయ్యదొర తన ఆవుల మందను శనివారం మేతకోసం తోలుకెళ్లాడు. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో కొండ నుంచి దిగిన పులి ఆవుల మందపై పంజా విసిరింది. ఓ ఆవును హతమార్చింది. ఈ ఘటనను చూసిన కాపరి భయభ్రాంతులకు గురై పరుగు తీశారు. ఆవులన్నీ చెల్లాచెదురయ్యాయి. కాసేపటికి ఆ ప్రాంతంలోని పశువుల కాపరులందరూ అప్రమత్తమయ్యారు. ఘటనా స్థలం వద్దకు చేరుకుని కేకలు వేశారు. అప్పటికే సగం తిన్న ఆవు కళేబరాన్ని విడిచిపెట్టి పులి కొండపైకి చేరుకుంది. ఆవుల కాపరులు ఇచ్చిన సమాచారం మేరకు గ్రామస్తులు పెద్దసంఖ్యలో చేరుకున్నారు. అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. పులిదాడిచేసిన తీరును అటవీశాఖ అధికారులకు పశువుల కాపరులు వివరించారు. పులి సంచరిస్తోందని, ఈ ప్రాంతీయులందరూ అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు హెచ్చరికలు జారీచేశారు. పులిని పట్టుకునేందుకు బోనులు ఏర్పాటుచేస్తున్నట్టు తెలిపారు.

క్లుప్తంగా

వేడుకగా ప్రపంచ పుస్తక దినోత్సవం



విజేతలకు జ్ఞాపికలు అందజేస్తున్న ముఖ్యఅతిథి నారాయణ

విజయనగరం అర్బన్: గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో ప్రపంచ పుస్తక దినోత్సవం శనివారం వేడుకగా జరిగింది. కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ సహాయక గ్రంథాలయ అధికారి డాక్టర్ డి.నారాయణ ముఖ్యఅతిథిగా హాజరై తొలిత జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాలను ప్రారంభించారు. సదస్సు అనంతరం నిర్వహించిన వివిధ అంశాల పోటీల విజేతలకు ముఖ్యఅతిథి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ వెంకటలక్ష్మి, కళాశాల గ్రంథాలయ అధికారిణి డాక్టర్ లెంక సత్యవతి, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

30న శిష్టకరణ సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక

విజయనగరం టౌన్: జిల్లా శిష్టకరణ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నికలు ఈ నెల 30న ఆదివారం ఉదయం 10 గంటలకు ఆర్టీసీ కాంప్లెక్స్ వద్దనున్న అమర్‌భవన్‌లో నిర్వహించనున్నట్టు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.పి.గౌరీశ్వరరావు శనివారం తెలిపారు. ఎన్నికల నిర్వహణాధికారిగా జి.మురహరి రావు, విశ్వేశ్వరరావులు వ్యవహరిస్తారన్నారు. జిల్లాలోని అన్ని మండలాల యూనిట్ల నుంచి అధ్యక్ష, కార్యదర్శులతో పాటు సభ్యులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

కొట్లాట కేసు నమోదు

రేగిడి: మండలంలోని మునకవలస గ్రామంలో ఈ నెల 21న జరిగిన కొట్లాటకు సంబంధించి ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసరావు శనివారం తెలిపారు. ఇద్దరు అన్నదమ్ములు మధ్య స్థల వివాదం కారణంగా ఈ కొట్లాట జరిగినట్లు వెల్లడించారు. శాసపు తవిటినాయుడు, శాసపు రమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేశామని, దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

సీతంపేట: మండలంలోని చింతాడకు చెందిన ఎస్.చిన్నారావు శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. తన ద్విచక్ర వాహనంపై చింతాడ నుంచి సీతంపేటకు వస్తుండగా ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన చిన్నారావును స్థానిక ఏరియా ఆస్పత్రికి తీసుకురాగా వైద్యులు ప్రాథమిక చికిత్స చేశారు. మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ నీలకంఠరావు తెలిపారు.

డెంకాడ: మండలంలోని విజయనగరం - నాతవలస ఆర్‌అండ్‌బీ రహదారిపై దొడ్డిబాడువ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయపడ్డారు. విజయనగరం వైపు నుండి నాతవలస వైపు వెళ్తున్న ఆటోను వెనుక నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ఓవర్ టేక్ చేస్తూ ఆటోను ఢీకొట్టిందని స్థానికులు తెలిపారు. దీంతో ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో ఆటో డ్రైవర్ బి.ఆదినారాయణ గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం విజయనగరం తరలించారు.

అన్నపై హత్యాయత్నం చేసిన తమ్ముడి అరెస్టు

బొబ్బిలి: పట్టణంలోని పాత బొబ్బిలిలో గుణుపూరు కృష్ణపై పెట్రోల్ పోసి హత్యాయత్నం చేసిన అతని తమ్ముడు గోపాల్‌ను అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ పి.జ్ఞానప్రసాద్ విలేకర్లకు శనివారం తెలిపారు. ఈ నెల 20న వేకువజామున హత్యాయత్నం చేసిన వెంటనే గోపాల్ పరారయిన సంగతి పాఠకులకు తెలిసిందే.. కాగా బాధితుడు కృష్ణ ప్రస్తుతం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 375.00
విజయనగరం	రూ. 379.00
శ్రీకాకుళం	రూ. 379.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,930-00
బంగారం(22సి. 10గ్రా.)	55,850-00
వెండి (కిలో)	81,000-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹122	₹214	₹ 224

రండి.. ఈదేద్దాం...



స్విమ్మింగ్ పూల్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- వేసవి సందడి
- సిద్ధమైన ఆక్వా స్విమ్మింగ్ పూల్
- నెలకు పెద్దలకు రూ.1000, చిన్నారులకు రూ.500 చొప్పున ప్రవేశ రుసుం
- ఇదే ప్రాంగణంలో రెండు జిమ్‌ల సేవలు అందుబాటులోకి
- ఉదయం, సాయంత్రం వేళల్లో శిక్షణకు అవకాశం



వేసవి సందడికి సిద్ధమైన ఆక్వా స్విమ్మింగ్ పూల్

విజయనగరం: ఈత (స్విమ్మింగ్) సాధకులకు శుభవార్త. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని కంటోన్మెంట్ ప్రాంతంలో గల ఆక్వా స్విమ్మింగ్ పూల్ వేసవి సందడి సిద్ధమైంది. గతేడాది వరకు జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించిన పూల్‌ను నెలకు రూ.1.08 లక్షలు వసూలు చేస్తూ ఈ ఏడాది మార్చి 27 నుంచి 3 ఏళ్ల పాటు ప్రైవేటు సంస్థకు అప్పగించగా... సదరు నిర్వాహకులు వేసవి శిక్షణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో గతంలో నిర్మించిన స్విమ్మింగ్ పూల్ ఆధునిక వసతులతో తాజాగా మళ్లీ స్విమ్మర్లకు ఆహ్వానం పలుకుతోంది. మరమ్మతులు, ఆధునీకరణ పనుల కోసం ఈ స్విమ్మింగ్ పూల్ గత కొంతకాలంగా మూసివేశారు. దీని నిర్వహణ బాధ్యతలను ప్రైవేటు సంస్థకు అప్పగించిన తర్వాత ఆ సంస్థ రూ.28 లక్షలతో దీనిని ఆధునీకరించి మరిన్ని వసతులతో సిద్ధం చేసింది.

నగరంలోని ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో గల స్విమ్మింగ్ పూల్‌లో ప్రతి ఏడాది ఎంతో మంది చిన్నారులు, పెద్దలు సాధన చేస్తుంటారు. అందులో భాగంగానే ఈ ఏడాది ఔత్సాహికులను ప్రోత్సహించే దిశగా అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రతి రోజు ఉదయం 5 గంటల నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సాధకులకు అనుమతించనున్నారు. ఈత సాధనకు వచ్చే వారి నుంచి గతంలో మాదిరి నెల వారి రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ఇందుకోసం పెద్దలు రూ.1000 చొప్పున చెల్లించాల్సి ఉండగా.... 12 ఏళ్లలోపు చిన్నారుల నుంచి రూ.500 చొప్పున చెల్లించేలా నిర్ణయించారు. ప్రతి ఒక్కరు రోజులో గంట పాటు ఈత సాధన చేసేందుకు అవకాశం కల్పిస్తారు. సాధన కోసం వచ్చే వారు ప్రత్యేక దుస్తులు ధరించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు.

అందుబాటులో రెండు జిమ్‌లు

ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో ఈత కొలనుతో పాటు రెండు జిమ్‌లు అందుబాటులోకి వచ్చాయి. వ్యాయామ సాధకుల కోసం వీటిలో ఉన్న యంత్రాలను, ఇతర సామగ్రిని మరమ్మతులు చేశారు. ఈ జిమ్‌లలో సాధన చేసేందుకు నెలవారి రుసుం చెల్లించాల్సి ఉంటుంది. పాత జిమ్‌లో సాధన చేయాలనుకునే వారు రూ.రూ.300, ఆధునాతన పరికరాలతో కూడిన మరో జిమ్‌లో సాధనకు రూ.600గా ధర నిర్ణయించారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో జిమ్‌లు అందుబాటులో ఉండనున్నాయి.

మరింత మంది జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలి: కోలగట్ల

ఆక్వా స్విమ్మింగ్ పూల్‌లో సాధన చేసిన క్రీడాకారులు పలు రాష్ట్ర, జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో సత్తా చాటారని, అదే బాటలో మరింత మంది జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆకాంక్షించారు. నగరంలోని కంటోన్మెంట్ ప్రాంతంలో గల ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రాంగణంలోని స్విమ్మింగ్ పూల్‌ను ఆయన శనివారం పునఃప్రారంభించారు. అనంతరం స్విమ్మింగ్ పూల్ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించి, వారికి అవసరమైన వసతులు కల్పించేందుకు సిద్ధంగా వున్నామని చెప్పారు. అన్ని రంగాలతో పాటు క్రీడారంగాన్ని కూడా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వున్నారని, అందులో భాగంగానే ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ సహాయ సహకారాలతో నగరంలోని అన్ని స్టేడియంలు, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లలో వసతుల కల్పనకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. రాజీవ్ స్టేడియంలో రాత్రివేళల్లో నడకకు వీలుగా లైట్లు ఏర్పాటు చేయించామని, రానున్న రోజుల్లో క్రీడాకారులకు ఎలాంటి వసతులు కావాలన్నా కల్పించేందుకు సిద్ధంగా వున్నామని చెప్పారు. డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియం ఆధునీకరణకు రూ.20 లక్షలతో ఇటీవల శంకుస్థాపన చేయటం జరిగిందని తెలిపారు. ఇక్కడి స్విమ్మింగ్ పూల్‌లో శిక్షణ పొందిన బాలబాలికలు రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ఎంతగానో రాణించారని డిప్యూటీ స్పీకర్ పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఎందరో స్విమ్మర్లను తీర్చిదిద్దేందుకు ఈ ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ దోహదపడగలదని ఆకాంక్షను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సెట్విజ్ సీఈఓ రాంగోపాల్, వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ వి.ఎస్.ప్రసాద్, స్థానిక కార్పొరేటర్ బోనెల ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమంతో సంతోషం

- ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర



ప్రజలకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

మెంటాడ: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమంతో ప్రజల్లో సంతోషం నెలకొందని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని లోతుగెడ్డ సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందించారు. సంక్షేమ పథకాలు అర్హతే ప్రామాణికంగా పార్టీలకతీతంగా అందజేస్తున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. సాంకేతిక కారణాలతో ఎవరికైనా అర్హులకు అందకుంటే తక్షణమే సమస్య పరిష్కరించాలన్నారు. మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా చేయడానికి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బీమారావు, వైస్ సర్పంచ్ ఎస్వీ నాయుడు, ఎంపీడీఓ త్రివిక్రమ్, తహసీల్దార్ ఆదిబాబు, ఎంపీపీ ఆర్ఎస్ నాయుడు, వైస్ ఎంపీపీలు ఎస్ఈ రావు, పి.దుర్గ తదితరులు పాల్గొన్నారు.

చేతక్ షోరూం ప్రారంభం



బజాజ్ చేతక్ ఎలక్ట్రిక్ వాహనాన్ని కొనుగోలుదారులకు అందజేస్తున్న చిత్రం

విజయనగరం: బజాజ్ ఆటో వారి సరికొత్త చేతక్ షోరూం శనివారం విజయనగరంలో ఘనంగా ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జోనల్ మేనేజర్ జీఎస్.ఆరాధ్యుల, ఏరియా సర్వీస్ మేనేజర్ అరుణ్‌కుమార్ వెంకటేష్‌ల చేతుల మీదుగా నూతనంగా షోరూంను ప్రారంభించారు. ఈ సందర్భంగా వరుణ్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్ దేవ్ మాట్లాడుతూ చేతక్ కస్టమర్‌ల కోసం విజయనగరంలో నూతన షోరూం ప్రారంభించటం ఆనందంగా ఉందన్నారు. గతంలో ఫ్యామిలీ స్కూటర్‌గా ప్రసిద్ధి చెందిన బజాజ్ వారి చేతక్ నేడు సరికొత్త అవతారంలో ఎలక్ట్రిక్ వాహనంగా రూపుదిద్దుకొని మార్కెట్‌లోకి ప్రవేశించిందని తెలిపారు. బజాజ్ చేతక్ ఎలక్ట్రిక్ స్కూటర్‌లకు కస్టమర్ల నుంచి అనూహ్యమైన స్పందన లభిస్తోందన్నారు. కార్యక్రమంలో వరుణ్ బజాజ్ సీఈఓ శ్రీనివాస్, చేతక్ ఏరియా సేల్స్ మేనేజర్ గోపాల్, సిబ్బంది, కస్టమర్లు పాల్గొన్నారు.

పుస్తక సేకరణకు ప్రత్యేక డ్రైవ్



దాతల నుంచి పుస్తకాలు సేకరిస్తున్న జిల్లా గ్రంథాలయ సేవా సంఘం ప్రతినిధులు

విజయనగరం అర్బన్: ప్రపంచ పుస్తక దినోత్సవం పురస్కరించుకొని పుస్తక సేకరణ కోసం ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తున్నామని జిల్లా గ్రంథాలయ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి కె.దయానంద్ తెలిపారు. శనివారం పులువురు పుస్తకదాతల ఇళ్లకు వెళ్లి పుస్తకాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం ఎంత పెరిగినా పుస్తకాలకున్న విలువ తగ్గదని, పుస్తక పఠనం విజ్ఞాన దాయకమే కాకుండా ఆరోగ్యదాయకమని అన్నారు. సంఘం ఆధ్వర్యంలో పుస్తక హుండీ గత కొంత కాలంగా చేపడుతున్నామని ఇళ్లల్లో వృథాగా ఉన్న విలువైన పుస్తకాలను సేకరించి అవసరమైన విద్యార్థులకు గ్రంథాలయాలకు అందజేయడమే ఈ కార్యక్రమం లక్ష్యమని అన్నారు. పుస్తకాలు అందజేయాలనుకునే వాళ్లు 9849377577 ఫోన్ నంబరును సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపకులు అబ్దుల్ రవూఫ్, జయంతి కామేశ్వరి, పద్మ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు కూలీ మృతి



పిడుగుపాటుతో చనిపోయిన అప్పారావును తీసుకొస్తున్న గ్రామస్తులు



బొంగరాల అప్పారావు (ఫైల్)

శృంగవరపుకోట: ఉపాధి కోసం వెళ్లిన భార్యాభర్తల్లో భార్య కళ్లెదుటే భర్త పిడుగుపాటుకు గురై శనివారం మృతి చెందాడు. దీంతో భార్య సొమ్మసిల్లి పడిపోయింది. ఈ విషాదకర ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు.. మామిడిపల్లి గ్రామంలో ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న బొంగరాల అప్పారావు(45) తన భార్య లక్ష్మణ, తల్లి, ఇద్దరు కుమారులతో నివాసం ఉంటున్నాడు. అప్పారావు నిత్యం తన భార్యతో కూలి పనులకు వెళ్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. రోజులాగే శనివారం కూడా కొట్టాం జంక్షన్ సమీపంలోని ఇటుక బట్టీలో పనికి వెళ్లారు. మధ్యాహ్నం భోజనం చేసిన తరువాత మూడు గంటల సమయంలో మళ్లీ పనికి సిద్ధమయ్యారు. భార్యాభర్తలు అప్పారావు, లక్ష్మణ ఒకే చోట పని చేస్తున్న సమయంలో అప్పారావు వాటర్ బాటిల్ పక్కన పెట్టేందుకు అక్కడ నుంచి పక్కకు వెళ్లాడు. ఈ సమయంలో పెద్ద శబ్దంతో పిడుగు పడింది. దీంతో అప్పారావు శరీరం కాలిపోయి క్షణాల్లో మృత్యువాత పడ్డాడు. తన కళ్ల ముందే భర్త మృత్యువాత పడడంతో తట్టుకోలేని భార్య లక్ష్మణ సొమ్మసిల్లి పడిపోయింది. పరిసరాల్లో ఉన్న కూలీలు వచ్చి చూడగా అప్పారావు అప్పటికే చనిపోయాడు. భార్య లక్ష్మణకు సపర్యలు చేయగా స్పృహలోకి వచ్చింది. భర్తను చూసి కన్నీరుమున్నీరైంది. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

30న ఏపీజీఈఏ రాష్ట్ర సదస్సు



మాట్లాడుతున్న జిల్లా కమిటీ అధ్యక్షుడు రామచంద్రరావు

విజయనగరం అర్బన్: రాజమండ్రిలో ఈ నెల 30వ తేదీన నిర్వహించే సంఘం రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. జిల్లా కమిటీ స్థానిక సంఘం కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించింది. సమావేశంలో సంఘ నాయకులు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి జిల్లా స్థాయిలో కృషి చేస్తున్నామని రాష్ట్ర స్థాయిలో ఉద్యోగుల ఆకాంక్షలు నెరవేర్చడానికి రాష్ట్ర కమిటీ శ్రమిస్తుందని అన్నారు. రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపునకు సభ్యులు స్పందించి అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పి.రామచంద్రరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కార్యదర్శి కంటి వెంకటరమణ, రాష్ట్ర కార్యదర్శి ఎల్‌వీ యుగంధర్, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ పువ్వల శ్రీనివాసరావు, కోశాధికారి వై.శంకరరావు, ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్, సంయుక్త కార్యదర్శి శ్రీను, పట్టణ అధ్యక్షుడు బాల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

చందనసేవకు వేళాయె

- నేడే సింహాద్రి అప్పన్న చందనోత్సవం
- ఉదయం 4 గంటల నుంచి సర్వదర్శనం
- శోభాయమానంగా సింహగిరి



సహస్ర ఘటాభిషేకానికి కలశాలను సిద్ధం చేస్తున్న అర్చకులు



అప్పన్న నిజరూపం

సింహాచలం: దుష్టసంహారానికి ఉగ్రరూపధారియైన నృసింహుడు భక్తుల అభీష్టం నెరవేర్చేందుకు అనేక చోట్ల స్వయంభువుగా వెలిశాడు. అలాంటి ప్రసిద్ధ క్షేత్రాలలో సింహగిరి ఒకటి. తూర్పు కనుమలలో ప్రకృతి సౌందర్యం నడుమ సింహాద్రిపై పశ్చిమాభిముఖుడైన శ్రీ వరాహ లక్ష్మీనృసింహుడు అశేష భక్తకోటికి ఇష్టదైవం. వైశాఖ శుద్ధ తదియ నాడు భక్తజనకోటికి నిజరూప దర్శనం అనుగ్రహిస్తాడు. చందనయాత్ర నాడు నిజరూపం దర్శనం వైకుంఠంలో లక్ష్మీనారాయణులను దర్శించినంత ఫలితమని క్షేత్ర మహాత్మ్యం పేర్కొంటోంది.

ఆదివారం జరగనున్న చందనోత్సవానికి అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. తెల్లవారుజామున ఒంటి గంట నుంచి ఆలయ అర్చకులు వైదిక కార్యక్రమాలు ప్రారంభిస్తారు. స్వామివారిపై ఉన్న చందనాన్ని శాస్త్రోక్తంగా ఒలిచి నిజరూప భరితున్ని చేస్తారు. అనంతరం దేవస్థానం వంశపార ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజుకి తొలిదర్శనం కల్పిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామివారికి దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ పట్టువస్త్రాలు సమర్పిస్తారు. టీటీడీ తరఫున సంప్రదాయ వస్త్రసమర్పణ ఉంటుంది. ఉదయం 4 గంటల నుంచి సర్వదర్శనం భక్తులకు అందజేస్తారు. రాత్రి 7 గంటల వరకే భక్తులను క్యూల్లోకి అనుమతిస్తారు. తరువాత క్యూల ప్రవేశ ద్వారాలు మూసివేసి అప్పటి వరకు ఉన్న భక్తులకు స్వామివారి దర్శనాన్ని కల్పిస్తారు. రాత్రి 8.30 గంటల నుంచి పాంచరాత్ర ఆగమశాస్త్ర పండితులు త్రిదండి చినజీయర్‌స్వామి పర్యవేక్షణలో స్వామికి సహస్ర ఘటాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. సింహగిరిపై ఉన్న గంగధార వద్ద నుంచి శ్రీవైష్ణవ స్వాములు కలశాలతో నీటిని తీసుకురాగా స్వామికి అభిషేకం చేస్తారు. పంచామృతాభిషేకాలు నిర్వహిస్తారు. తదుపరి విశేష పూజలు నిర్వహించిన అనంతరం స్వామికి తొలివిడతగా మూడు మణుగుల చందనాన్ని సమర్పిస్తారు.

పకడ్బందీ ఏర్పాట్లు

ఈసారి 1.50 లక్షల మంది భక్తులు వస్తారని జిల్లా యంత్రాంగం అంచనా వేసింది. సర్వదర్శనంతో పాటు రూ.300, రూ.1000 దర్శనం టికెట్లు, రూ.1500 వీవీఐపీల టికెట్లు అందుబాటులో ఉంచారు. తొలిసారిగా రూ.300, రూ.1000 టికెట్లు ఆన్‌లైన్‌లో విక్రయాలు జరిపారు. కాగా రూ.300 దర్శనం టికెట్లపై వేచ్చేవారికి కూడా వివిధ స్లాట్‌ల్లో దర్శన సమయాన్ని కేటాయించారు. కలెక్టర్ మల్లికార్జున, దేవస్థానం ఈవో త్రినాథరావు, జీవీఎంసీ, ఫైర్, ఆర్టీసీ, మెడికల్ అండ్ హెల్త్, పోలీస్, ఫైర్, రెవెన్యూ తదితర శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేశారు. కాగా నగర పోలీస్ కమీషనర్ డాక్టర్ త్రివిక్రమ్ వర్మ ఆధ్వర్యంలో పన్నెండు వందలకి పైగా పోలీసులు చందనోత్సవం బందోబస్తు నిర్వహించనున్నారు. చందనోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలోని ప్రహ్లాదమండపాన్ని విశేషంగా పూలతో అలంకరించారు.

చందనంలో సుగంధ ద్రవ్యాల మేళవింపు

చందనోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి సమర్పించే మూడు మణుగుల పచ్చిచందనంలో శనివారం దేవస్థానం అర్చకులు పలు రకాల సుగంధ ద్రవ్యాలను కలిపారు. ఈ చందనాన్ని ఆదివారం రాత్రి సహస్ర ఘటాభిషేకం అనంతరం స్వామికి సమర్పించనున్నారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు కార్యక్రమాన్ని నిర్వహించారు.



చందనోత్సవం బందోబస్తుకు వచ్చిన పోలీసులు



చందనంలో సుగంధ ద్రవ్యాలను కలుపుతున్న అర్చకులు